క్లుప్తంగా

కొండలమ్మకు వెండి పళ్లెం సమర్పణ



గుడ్లవల్లేరు: కొండలమ్మ అమ్మవారికి ఆలయ మాజీ చైర్మన్ పెన్నేరు ప్రభాకరరావు వెండి పళ్లాన్ని సమర్పించారు. శనివారం ఆలయ చైర్మన్ శేషం గోపి, ఈఓ కానూరి సురేష్‌కు 258 గ్రాముల వెండి పళ్లాన్ని అందించారు. దాత పేరుతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేయించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు.

రూ.20 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం



పామర్రు: స్థానిక సచివాయం-2 పరిధిలోని 9,10 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ.20 లక్షలతో సీసీ రహదారి పనులను ప్రారంభించారు. ఆయా వార్డుల్లో మొత్తం 5 సీసీ రహదార్లు సుమారు 530 మీటర్ల వరకు నిర్మిస్తున్నారు. ఈ పనులను స్థానిక ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ పనులను నాణ్యతా ప్రమాణాలకు లోబడి నిర్వహించాలన్నారు. గ్రామాల్లో అధ్వానంగా ఉన్న రహదార్లను ప్రథమ ప్రాధాన్యతా క్రమంలో ఏర్పాటు చేసి ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పింఛన్ అందజేత



మండవల్లి: మండలంలోని కానుకొల్లులో పింఛనుదారుడు అనారోగ్యానికి గురై విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీరు బాలింత కావడంతో, సర్పంచ్ ఆదేశాల మేరకు వెల్ఫేర్ అసిస్టెంట్ సురేష్ శనివారం విజయవాడ వెళ్లి లబ్ధిదారుడికి పింఛను సొమ్ము అందజేశారు. వెల్ఫేర్ అసిస్టెంట్‌ను గ్రామస్తులు అభినందించారు.

వన్‌టౌన్ సీఐ బాధ్యతల స్వీకారం



గుడివాడరూరల్: గుడివాడ వన్‌టౌన్ సీఐగా కె.ఇంద్ర శ్రీనివాసరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పని చేస్తున్న గోవిందరాజులు ఏలూరు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. ఏలూరులో దిశ సీఐగా పని చేస్తున్న శ్రీనివాసరావును వన్‌టౌన్ సీఐగా నియమించారు. సీఐ శ్రీనివాసరావుకు బదిలీపై వెళ్తున్న గోవిందరాజులు బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ పట్టణంలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు కృషి చేస్తానన్నారు. పట్టణ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు.

ఎస్‌ఐ బాధ్యతల స్వీకారం

తోట్లవల్లూరు: మండల ఎస్‌ఐగా పి.విశ్వనాథ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో పమిడిముక్కల సీఐ చలపతి రావును మర్యాదపూర్వకంగా కలుసుకుని ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ ఎస్‌ఐగా పనిచేసిన జి.రమేష్‌ను జిల్లా అధికారులు వీఆర్‌కి పంపారు.

150 మంది రోగులకు పరీక్షలు



పమిడిముక్కల: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ కందిమళ్ల పూర్ణకుమారి సూచించారు. చోరగుడి సచివాలయంలో కూచిపూడి రవిప్రకాష్ సిలికానాంధ్ర హాస్పటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం ఆమె ప్రారంభించారు. జనరల్ సర్జన్ పృథ్వీ గణేష్, గైనకాలజిస్ట్ తాతా నీలిమ, డెంటిస్ట్ దివ్య రోగులకు పరీక్షలు చేశారు. 150 మంది రోగులను పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సిలికానాంధ్ర హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధారాలు ఉండబట్టే అరెస్టు

స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగు దేశం పార్టీ నేత చంద్రబాబు నాయుడు అరెస్టు సరైనదేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. తప్పుడుపని చేసిన వ్యక్తి ఎంత సీనియర్ అయినా, ఏస్థాయిలో ఉన్నా ప్రజాస్వామ్య వ్యవస్థలో తప్పుకోలేరని ఈ సంఘటన రుజువు చేస్తోందన్నారు. మూడు సంస్థలు విచారించిన మీదట తగిన ఆధారాలు ఉండబట్టే ఆయన్ను అరెస్టు చేశారని, దీనిని కక్ష సాధింపుచర్యగా టీడీపీ నాయకులు ప్రచారం చేసుకుని సానుభూతి పొందాలని చూస్తున్నారని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

–గుడివాడ రూరల్, పామర్రు, పెదపారుపూడి, పమిడిముక్కల

తప్పు చేశాడు కాబట్టే అరెస్ట్..



చంద్రబాబునాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ పేరిట వందలకోట్ల రూపాయలు ప్రజల సొమ్మును దిగమింగాడు. అధికారులు నిజాలను నిర్ధారించుకున్న తర్వాత అరెస్ట్ చేశారు. నేరస్తులను అరెస్ట్ చేయకుండా ముద్దు పెట్టుకుంటారా, టీడీపీ నాయకులు అనవసర రాద్ధాంతం చేస్తున్నారు. దీనికి తగిన మూల్యం చెల్లించుకుంటారు.

గూడపాటి వెంకటేశ్వరరావు, సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకులు

బయటకు వస్తున్న పాపాల చిట్టా..



చంద్రబాబు చేసిన పాపాల చిట్టా ఒక్కొక్కటిగా బయట పడుతుంది. చేసిన పాపాలు దాగవు. నేరం ఎప్పుడుకైనా బయట పడుతుంది. చంద్రబాబు చేసిన పాపాలు బయటపడటం ఇది ఆరంభమే. మరిన్ని స్కామ్‌లు బయటకు వస్తాయి. ఇక చంద్రబాబు జైలులో చిప్పకూడు తిని ఉండాల్సిందే.

పెయ్యల ఆదాం, ఎంపీపీ నందివాడ

నేరం చేసిన వారు శిక్ష అనుభవించాలి



చంద్రబాబు ఆర్థిక నేరస్తుడు. నేర ప్రవృత్తి అతని రక్తంలోనే ఉంది. మామను వెన్నుపోటు పొడిచి పదవిని లాక్కున్న వాడు ఆర్థిక నేరాలు చేయడానికి వెనుకాడడు. నేరం చేసిన చంద్రబాబుకు శిక్ష తప్పకుండా పడుతుంది. చేసిన పాపాలకు శిక్ష అనుభవించాలి.

ఎంవీ నారాయణరెడ్డి, గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్

తిన్న సొమ్మును కక్కించాలి. ..



40 ఏళ్ల రాజకీయ జీవితం, మూడుసార్లు ముఖ్యమంత్రి అని గొప్పలు చెప్పుకునే చంద్రబాబు ప్రజల ధనాన్ని లూటీ చేసి దేశ, విదేశాల్లో ఆస్తులు కొనుగోలు చేశాడు. రాష్ట్రాన్ని దోచుకుతిన్నాడు. వేలకోట్ల రూపాయలు స్విస్ బ్యాంక్‌ల్లో దాచాడు. చంద్రబాబు నుంచి తిన్న సొమ్మును కక్కించాలి.

మట్టా జాన్‌విక్టర్, గుడివాడ మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు

బాబు దురాగతాలకు అడ్డుకట్ట



చంద్రబాబును ప్రజాస్వామ్య బద్ధంగానే ప్రభుత్వం అరెస్టుచేసింది. దీనిని జీర్ణించుకోలేని స్థానిక నేతలు అల్లర్లు చేయటం దారుణం. అన్ని ఆధారాలతో అరెస్టు చేశారు. చంద్రబాబు అధికారంలో ఉండగా అధికార దుర్వినియోగం చేసి ప్రజలకు మోసం చేశారు. ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నారు.

ఆరేపల్లి శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ పామర్రు

ప్రజా ధనం దారి మళ్లింపు



ప్రజా ధనం రూ.371 కోట్ల నిధులు దారి మళ్లించారు. ఈ విషయమై పరిశీలనలు చేసి నిజ నిర్ధారణ అయిన తర్వాతే చంద్రబాబును అరెస్టు చేయటం జరిగింది. చట్టం తన పని తాను చేసుకుపోతుంది. న్యాయస్థానంలో నిరూపించుకోవాలి.

ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మండల ఆర్బీకే అధ్యక్షుడు, పామర్రు

చేసిన తప్పునకు..



ఎన్నో అవినీతి కార్యకలాపాలకు పాల్పడి కూడా గత అనేక ఏళ్లుగా చంద్రబాబు వ్యవస్థలను మేనేజ్ చేశారు. ఈ రోజు దొరికారు. చేసిన తప్పునకు శిక్ష అనుభవించక తప్పదు. చట్టం ముందు అందరూ సమానమే.

కళ్లం వెంకటేశ్వరరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, తోట్లవల్లూరు

ప్రభుత్వంపై నిందలు తగదు



స్కిల్ స్కాంపై సీఐడీ దర్యాప్తు చేసి ఆధారాలతో బాబుని అరెస్టు చేసింది. అవినీతి కేసులో అరెస్టై ప్రజల్లో సానుభూతి కోసం నిష్పక్షపాతంగా దర్యాప్తు చేస్తున్న సీఐడీపై, ప్రభుత్వంపై నిందలు వేయటం తగదు.

మోర్ల రామచంద్రరావు, వైఎస్సార్ సీపీ పంచాయతీ రాజ్ విభాగం జిల్లా కన్వీనర్, తోట్లవల్లూరు

చట్టానికి లోబడే..



మాజీ సీఎం చంద్రబాబును చట్టపరిధికి లోబడే అరెస్ట్ చేశారు. స్కిల్ స్కాంలో పక్కా ఆధారాలతో సీఐడీ అరెస్ట్ చేసింది. ఈ కేసులో చంద్రబాబు అడ్డంగా బుక్ అయ్యారు. టీడీపీ సానుభూతి కోసం రచ్చ చేయడం మానుకోవాలి.

పరసా జగన్, మండల సచివాలయాల కన్వీనర్

యువత భవిష్యత్తుతో ఆటలా..



నిరుద్యోగ యువత కోసం ఖర్చు చేయాల్సిన నిధులతో అక్రమాలకు పాల్పడటం, యువత భవిష్యత్తుతో ఆటలాడుకోవడం అత్యంత హేయం. జాబు రావాలంటే– బాబు రావాలంటూ యువతను నమ్మించి మోసం చేశారు.

కంభపు రాంబాబు, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్

బాబు అరెస్టు న్యాయమే..



చంద్రబాబును అరెస్టు చేయటం న్యాయపరమైనది. బాబు పాలనలో ఆయన చేసిన స్కాముల్లో ఇది ఒకటి బట్టబయలైంది. అంతేగాని ఇది కక్ష సాధింపు కాదు. ప్రభుత్వాన్ని ప్రతిపక్షాలు ఆడిపోసుకోవటంలో అర్థం లేదు.

శేషం గోపి, వడ్లమన్నాడు, గుడ్లవల్లేరు మండలం

చట్టం తనపని తాను...



చంద్రబాబు తన తప్పులను కప్పి పుచ్చుకోవటానికి చీకట్లో చిదంబరాన్ని ఆనాడు కలిశారు. బాబు విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుంది. స్కాములు చేసినందుకే ఆయన అరెస్టు.

తాళ్లూరి మాధవ్, వేమవరం, గుడ్లవల్లేరు మండలం

కక్ష సాధింపు చర్య కాదు..



చంద్రబాబు అరెస్టు కక్ష సాధింపు చర్య అని టీడీపీ నాయకులు చెప్పుకోవటం సరి కాదు. టీడీపీ నాయకులు సానుభూతి కోసం హడావుడి చేస్తున్నారు. అవినీతి పాల్పడినట్లు నిర్ధారణ కావటంతోనే సీఐడీ అధికారులు అరెస్టు చేశారు.

పల్లా అరవింద్, రైతు, వానపాముల

బాబు అరెస్టు తప్పు కాదు..



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.371 కోట్లు దోచుకుతిన్నట్లు బహిర్గతం అవ్వటంతో చంద్రబాబు అరెస్టు చేయటం తప్పు లేదు. ఇప్పటి వరకు పలు కేసుల్లో స్టేలు తెచ్చుకని పబ్బం గడుపు కున్న చంద్రబాబుకు పాపం పడింది.

గోగం సురేష్, ఎంపీపీ, పెదపారుపూడి

వేలకోట్లు ఎలా సంపాదించారు..



రెండు ఎకరాల భూమి ఉన్న చంద్రబాబుకు వేల కోట్ల విలువైన ఆస్తులు ఎక్కడ నుంచి వచ్చాయి. ముఖ్యమంత్రి పదవిని అడ్డుపెట్టుకుని ప్రజా ధనాన్ని లూటీ చేశాడు. వేల కోట్లు సంపాదించి ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేశాడు. ఇన్నాళ్లకు పాపం పండింది.

మండలి హనుమంతరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు

అవినీతికి దండన తప్పదు



అవినీతికి పాల్పడిన ఎంతటి వారికైనా న్యాయస్థానాల్లో, ప్రజాకోర్టులో దండన తప్పదు. రాష్ట్ర ప్రజలను పలు రకాలుగా వంచన చేస్తూ అధికారంలో ఉన్నప్పుడు అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడి రూ.వేలకోట్లు సంపాదించిన చంద్రబాబు చివరకు చట్టం చేతికి చిక్కారు.

ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ముదినేపల్లి రూరల్

బాబు అరెస్ట్‌లో రాజకీయం లేదు

- ప్రజలను మభ్యపెట్టేందుకే టీడీపీ నేతల విమర్శలు
- వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గుడివాడ టౌన్: తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని అరెస్ట్ చేయడం పట్ల టీడీపీ నాయకులు చేస్తున్న రాద్ధాంతాన్ని వైఎస్సార్ సీపీ నాయకులు ఖండించారు. శనివారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నాయకులు మాట్లాడారు. చంద్రబాబు నాయుడు ఉద్దేశ పూర్వకంగానే ప్రజల డబ్బు కాజేసినట్లు పూర్తి ఆధారాలున్నాయన్నారు. యువతకు శిక్షణ ఇస్తామంటూ షెల్ కంపెనీలు ప్రారంభించి దొడ్డిదారిన కొట్టేసిన విషయంపై సీఐడీ అధికారులకు పూర్తి సమాచారం ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో వందలకోట్ల రూపాయలు చంద్రబాబు, ఆయన బినామీలు కాజేసిన వివరాలన్నీ సీఐడీ అధికారులు సేకరించారన్నారు. ఎవరో ఒక వ్యక్తి రాసిన లేఖకు స్పందించి ఈ ప్రభుత్వం చంద్రబాబు నాయుడిని అరెస్ట్ చేయలేదన్నారు. ఒక ప్రైవేట్ సంస్థ రూ.3,356 కోట్లు యువతకు స్టయిఫండ్‌గా ఇస్తుందని మభ్యపెట్టి ప్రభుత్వం వాటాగా జీఎస్టీతో కలిపి రూ.371 కోట్లు నిధులు కేటాయించి దోచుకున్నారని సీఐడీ అధికారులు ధృవీకరించారన్నారు. అన్ని ఆధారాలు బయటపెట్టి అరెస్ట్ చేశారన్నారు. తాము అధికారంలో ఉన్నాం కనుక దోచెయ్యవచ్చని చేసిన పాపం నేడు పండిందన్నారు. టీడీపీ నాయకులు ప్రజలను మభ్యపెట్టేందుకు గగ్గోలు పెడుతున్నారని విమర్శించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు మెరుగమాల కాళీ, పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, చుండూరి శేఖర్, కె.ఆంజనేయ ప్రసాద్, కృష్ణ, శేషగిరిరావు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతో నేతల రాద్ధాంతం



పామర్రు కూడలివద్ద పోలీసుల పహరా

పామర్రు: స్కిల్ డెవలప్మెంట్ కుంభ కోణంలో ప్రధాన కారకుడిగా ఉన్న చంద్రబాబు నాయకుడు అరెస్టుపై పామర్రులోని టీడీపీ చోటామోటా నాయకులు రాద్ధాంతం చేసేందుకు ప్రత్నించగా స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. సుమారు రూ.371 కోట్ల ప్రజల డబ్బులు అప్పనంగా చంద్రబాబునాయుడు అడ్డదారిన తన ఖాతాలో వేసుకున్నాడు. కుంభ కోణం బయట పడి అరెస్టు అయ్యాడు. తమ నేత అరెస్టును జీర్ణించుకోలేని కొందరు చోట మోటా నాయకులు నాలుగురోడ్ల కూడలి వద్ద కొద్దిసేపు రాద్ధాంతం చేశారు. వీరిని స్థానిక పోలీసులు అడ్డుకున్నారు. అప్పటికీ వీరి ఆందోళన ఆగక పోవడంతో అరెస్టు చేశారు. అనంతరం స్థానిక కూడలి వద్ద పోలీసులు అల్లరిమూకల నుంచి ప్రజలను రక్షించేందుకు పహరా కాశారు. పామర్రు సీఐ వెంకటనారాయణ, ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పోలీసులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

టీడీపీ నేతల వింత పోకడ

- ఆధారాలున్నా..ఆందోళనలతో హల్‌చల్
- పట్టించుకోని ప్రజలు



ముదినేపల్లి సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద పోలీసులను తోసేస్తున్న టీడీపీ కార్యకర్తలు

కైకలూరు: టీడీపీ అధినేత చంద్రబాబు స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో ఆధారాలతో సహా ఇరుక్కుని అరెస్టు అయినప్పటికీ నియోజకవర్గంలో తెలుగుదేశం నేతలు మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తూ శనివారం నానాయాగీ చేశారు. గతంలో టీడీపీ ఇన్‌చార్జిగా పని చేసిన జయమంగళ వెంకటరమణ ఆ పార్టీలో ఇమడలేక వైఎస్సార్ సీపీలోకి వచ్చి ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. అప్పటి నుంచి ఇన్‌చార్జి లేకుండానే విభేదాలతో పార్టీ నడుస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు అరెస్టు అంశం రావడంతో ఎవరికివారు బలప్రదర్శనకు దిగారు. 50 మందితో సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్దకు చేరారు. టీడీపీ కార్యకర్తలు ఒక్కసారిగా చుట్టుముట్టడంతో ఇద్దరు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. పెదపాలపర్రులో 14 మందిపై కేసు నమోదు చేశారు. కైకలూరు మండలంలో ఆటపాక టీడీపీ కార్యాలయం వద్ద గోడదూకుతున్న కొందరిని సీఐ ఆకుల రఘు అడ్డుకున్నారు.

స్కాంలో పూర్తిగా ఇరుక్కున్న చంద్రబాబు

ఎమ్మెల్యే డీఎన్నార్



ఎమ్మెల్యే డీఎన్నార్

కైకలూరు: స్కిల్ డెవలప్‌మెంట్ స్కాంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పూర్తిగా ఇరుక్కున్నారని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) చెప్పారు. శనివారం ఎమ్మెల్యే డీఎన్నార్ చంద్రబాబు అరెస్టుపై శనివారం మాట్లాడుతూ అన్ని అధారాలతోనే చంద్రబాబును అరెస్టు చేశారన్నారు. తెలుగుదేశం నాయకులు గగ్గోలు పెట్టాల్సిన అవసరం లేదన్నారు. తండ్రీ, కొడుకులు సభల్లో పోలీసులపై కవ్వింపు చర్యలకు పాల్పడి ప్రజలపై కాల్పులు జరిగితే శవరాజకీయాలు చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ఫ్లెక్సీలను చించేయండని, పీకేయండి అంటూ రెచ్చగొడుతున్నారన్నారు. అటువంటి కుయుక్తులను ప్రభుత్వం సాగనివ్వదన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అని డీఎన్నార్ చెప్పారు.

బ్యాంకు సేవలపై అవగాహన పెంచుకోవాలి



బ్యాంకు పథకాలను వివరిస్తున్న ఇండియన్ బ్యాంకు మేనేజర్ దుర్గారావు

మండవల్లి: బ్యాంకు సేవలు, ఆర్థిక అక్షరాస్యతపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఇండియన్ బ్యాంకు మేనేజర్ బి.దుర్గారావు పేర్కొన్నారు. స్థానిక బీసీ కాలనీలో శనివారం సచివాలయ కన్వీనర్ బుంగా రాణి ఏర్పాటు చేసిన సమావేశానికి ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ ఎల్ఎస్.భాస్కరరావు, మండల అధ్యక్షుడు టి.అప్పారావు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ సామాజిక భద్రత పథకాలు పీఎం సురక్ష బీమా యోజన, జీవన్ జ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన తదితర పథకాలపై ఖాతాదారులకు శనివారం అవగాహన కల్పించారు. పి.లక్ష్మీకుమారి, కె.విజయ, ఎం వెంకటరమణ, జి.చిట్టెమ్మ, ఎస్.వరలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

సమస్యలను గ్రామ స్థాయిలోనే పరిష్కరించుకోవాలి

సీనియర్ సివిల్ జడ్జి షణ్ముఖరావు



రాజీ కేసులో అవార్డు అందిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి షణ్ముఖరావు, న్యాయవాదులు

కైకలూరు: కుటుంబ కలహాలను గ్రామస్థాయి పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి జి.షణ్ముఖరావు సూచించారు. స్థానిక కోర్టు ప్రాంగణంలో నేషనల్ లోక్ అదాలత్ సందర్భంగా తాలూకా లీగల్ సర్వీసెస్ కమిటీ, బార్ అసోషియేషన్ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు శనివారం నిర్వహించారు. జడ్జి షణ్ముఖరావు మాట్లాడుతూ సమస్య ఎదురైనప్పుడు కుటుంబంలోనే ఒకరు జడ్జి పాత్రను పోషించాలన్నారు. కక్షిదారులు క్షమించే గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. జూనియర్ సివిల్ జడ్జి బి.శ్రీనివాసులు మాట్లాడుతూ భార్యభర్తలు సగం జీవితం అనుభవించిన తర్వాత చిన్న సమస్యలకు విడాకులు కోరుతున్నారన్నారు. దీంతో పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమవుతున్నారని చెప్పారు. లోక్ అదాలత్ అంటే ప్రజల కోర్టు అని అర్థమన్నారు. రాజీమార్గం రాచమార్గమని సూచించారు. బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ఎంవీవీ.సత్యనారాయణ, ఏపీపీ వడ్లాని శ్రీరామచంద్రమూర్తి, బార్ అసోషియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎంఎస్ఎస్.రాజు, జాయింట్ సెక్రటరీ చావలి శంకర్ శాస్త్రి, మహిళా ప్రతినిధి ఎండి రజిమున్నీ, లైబ్రరీ సెక్రటరీ కె రమాదేవి, ప్యానల్ అడ్వకేట్ పి పవన్ కాంత్, పి.ప్రసన్నకుమార్ పాల్గొన్నారు. రికార్డు స్థాయిలో సీనియర్, జూనియర్ కోర్టుల పరిధిలో 1,022 కేసులను రాజీ పద్ధతిలో పరిష్కరించారు. మొత్తం అపరాధ రుసుం రూ.36,59,545 వసూలు చేశారు.

గుడివాడ టౌన్: చిన్ని చిన్ని తగాదాలకు సంబంధించిన కేసులు రాజీమార్గంలో పరిష్కరించుకోవడం మంచిదని 11వ అదనపు జిల్లా జడ్జి జి.సుబ్రహ్మణ్యం అన్నారు. శనివారం స్థానిక కోర్టులో లోక్ అధాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారమైన కేసులకు అప్పీలు ఉండదని ఇక్కడ కేసుల పరిష్కారం విషయంలో కక్షిదారులు ఇద్దరికి న్యాయం జరుగుతుందన్నారు. మొత్తం నాలుగు బెంచీలు ఏర్పాటు చేయగా 607 కేసులు పరిష్కరించామని, అందులో క్రిమినల్ 532, సివిల్ 31, ఇతర కేసులు 44 పరిష్కరించామన్నారు. వాటి విలువ రూ.1 కోటి 86 లక్షల 51 వేల 400 అని వివరించారు. సీనియర్ సివిల్ జడ్జి ఎ.పూర్ణిమ, జూనియర్ సివిల్ జడ్జి పి.గాయత్రి, ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కె.నాగలక్ష్మి, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి షటిల్ పోటీలు



గుడివాడ టౌన్: ది గుడివాడ క్లబ్ (ఆఫీసర్స్ క్లబ్) ఏర్పాటై 100 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి షటిల్ టోర్నమెంట్స్ నిర్వహిస్తున్నట్లు క్లబ్ ఉపాధ్యక్షుడు గుత్తా నాని తెలిపారు. శనివారం క్లబ్ కార్యవర్గంతో కలిసి ఆయన మాట్లాడారు. ఆదివారం సాయంత్రం నుంచి ఈ పోటీలు ప్రారంభమవుతాయని, స్థానిక ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పోటీలు ప్రారంభిస్తారన్నారు. పోటీల్లో పాల్గొన్న విజేతలకు నగదు ప్రోత్సాహాలు అందజేస్తామని తెలిపారు. పోటీల ముగింపు అనంతరం 15 మంది క్లబ్ సభ్యులను సత్కరిస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కోశాధికారి అడపా జగదీష్, సభ్యులు పళ్లపోతు రమేష్, కె.రవికుమార్, కె.రాంబాబు, జి.పార్థసారధి, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

యలమర్రు(పెదపారుపూడి): మండలంలోని యలమర్రు గ్రామంలో ఆదివారం అమరావతి సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు అట్లూరి శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు పరీక్షలు చేస్తారు. మణిపాల్ ఆస్పత్రి సౌజన్యంత క్యాన్సర్, గుండె, జనరల్ వ్యాధులను పరీక్షలు చేసి అవసరమైన వారికి అపరేషన్లు చేస్తారన్నారు. చుట్టు పక్క గ్రామాల ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

ఏసు మార్గం అనుసరణీయం

అడ్డాడ(పామర్రు): ఏసుక్రీస్తు చూపిన సేవా మార్గంలో ప్రతి ఒక్కరూ ``పయనించాలని దైవజనులు క్రీస్తు రాయభారి పేర్కొన్నారు. మండల పరిధిలోని అడ్డాడ గ్రామంలోని శిలువ మిషన్ ఆధ్వర్యంలో మహా తైలాభిషేక పండుగను శనివారం ఘనంగా నిర్వహించారు. దైవజనురాలు లూధియా మాట్లాడుతూ ఎంతో మంది విశ్వాసులకు ప్రభువు సాక్షాలను ఇచ్చి వారిని ఆదుకున్నా రన్నారు. పాల్ భోయాజీ, ప్రభుకిరణ్ ప్రభు ప్రసంగాన్ని ఇచ్చి అనంతరం ఆలపించిన భక్తి పాటలు విశ్వాసులను ఆనందపరిచాయి. పాస్టర్లు ప్రభు, మిల్కీసదక్ (రామకృష్ణ), అకుల్లా (ప్రసాద్), సత్యం, విజయ్‌శేఖర్, అబ్రహాం తదితర పాస్టర్లుతో పాటుగా పరిసర గ్రామాల నుంచి అనేక మంది క్రీస్తు విశ్వాసులు పాల్గొన్నారు.

మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకం

మచిలీపట్నంటౌన్: భారతదేశంలో పలువురు మహనీయుల త్యాగాలు స్ఫూర్తిదాయకమని పలువురు వక్తలు పేర్కొన్నారు. సామాజిక పరివర్తన కేంద్రం ఆధ్వర్యంలో శనివారం నగరంలో సామాజిక పరివర్తనలో సెప్టెంబర్ అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న విద్యుత్ శాఖ డీఈ వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. నాయకుల త్యాగాలతో బహుజనులు స్వేచ్ఛా వాయువులు పీల్చే అవకాశం లభించిందన్నారు. పూణె ఒడంబడిక సందర్భంగా డాక్టర్ అంబేడ్కర్ ఎదుర్కొన్న సవాళ్లను వివరించారు. రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ చిలుకోటి కూర్మయ్య మాట్లాడుతూ పెరియార్ రామస్వామి నాయకర్ తమిళనాడులో చేపట్టిన ద్రవిడ ఉద్యమాన్ని వివరించారు. కాన్షీరాం, మహాత్మా జ్యోతిరావుపూలే, కవి కోకిల గుర్రం జాషువాల సేవలను వివరించారు. మహనీయుల చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమాన్ని మత్తే నాగరాజు, పంతగాని రమేష్, బట్టు శ్యామ్, చింతపల్లి మనోహర్ పర్యవేక్షించారు. సదస్సులో మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాలకు చెందిన పలువురు బహుజన నాయకులు పాల్గొన్నారు

వెంకన్నకు కోటి తులసీ పూజ

మచిలీపట్నంటౌన్: నగరంలోని బచ్చుపేటలో వేంచేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి శనివారం కోటి తులసీ పూజ అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం మంత్ర పుష్పం, తీర్థప్రసాదాల వినియోగం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై పూజలో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాన్ని ఆలయ అర్చకుడు ముత్తేవి శశికాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ముత్తేవి రవికాంత్, ఆలయ కార్యనిర్వహణాధికారి చక్రధరరావు పర్యవేక్షించారు.